క్లుప్తంగా

బలిజిపేటలో దోమలమందు స్ప్రే


మందు స్ప్రే చేయిస్తున్న అధికారులు, సిబ్బంది

బలిజిపేట: స్థానిక సర్పంచ్ రాఘలత ఆధ్వర్యంలో దోమల నివారణ మందును గురువారం మండల కేంద్రంలో స్ప్రే చేశారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా దోమలను నివారించేందుకు వీధికాలువలు, బావుల వద్ద పేరుకుపోయిన మురుగునీటిపైన, గోతులలో నిల్వ ఉండే నీటిపైనా, మురుగు, చెత్తాచెదారాలు పేరుకుపోయిన ప్రదేశాలలో మందును స్ప్రే చేసినట్లు సర్పంచ్ తెలిపారు. పరిసరాను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారిణి మాధురి ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జ్యోతీష్, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బలిజిపేట: 11కేవీ లైన్‌కు సంబంధించి బలిజిపేట రూరల్ ఫీడర్ పరిధిలో చెట్లను తొలగించేందుకు గాను శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ మేరకు ఏఈ సింహాచలం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలగర, మిర్తివలస, చెల్లింపేట, బర్లి, సుభద్ర, బడేవలస, శివరాంపురం, పణుకువలస, అరసాడ, పదమాయవలస, పి.చాకరాపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా బలిజిపేట టౌన్, నారాయణపురం ఫీడర్స్‌పై కూడా కొంత సమయం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. దీనిని గమనించి విద్యుత్‌శాఖకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా లక్ష్మీనృసింహస్వామికి ముడుపుల పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖీ నది తీరాన వేంచేసి ఉన్న లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆలయప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు ఘనంగా ముడుపుల పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని తులసీదళాలు, వివిధరకాల పూలతో అలంకరించారు. ముడుపుల పూజలకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివారికి వివిధరకాల పూజాసామగ్రితో పూజల్లో పాల్గొన్నారు. దూరప్రాంతాల నుంచి ముడుపుల పూజకు హాజరైన భక్తులందరికీ నిర్వాహకులు తీర్థప్రసాద వితరణ గావించారు.

సైబీరియా పక్షుల స్థావరం పరిశీలన


సైబీరియా పక్షుల స్థావరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బి.విజయ్‌చంద్ర

సీతానగరం: మండలంలోని చెల్లన్నాయుడువలసలో ఏటా తొలకరి పంటల సమయంలో వస్తున్న సైబీరియా పక్షులుండే స్థావరాన్ని ఎమ్మెల్యే బి విజయ్ చంద్ర గురువారం పరిశీలించారు. దశాబ్దాల కాలంగా చెల్లన్నాయుడువలస గ్రామానికి శివారులో ఉన్న చింత చెట్లను స్థావరాలుగా ఎంపిక చేసుకుని సైబీరియా నుంచి పక్షులురావడం. కార్తీక మాసంలో పౌర్ణమి పూజల నంతరం ఇక్కడి నుంచి పయనమవుతుంటాయి. అంతవరకూ ఇక్కడి పరిసర ప్రాంతాల్లో తిరుగాడుతూ సంతతిని అభివృద్ధి చేసి జన్మనిచ్చిన పిల్లలతోనే తిరుగు ప్రయాణం చేస్తాయి. ఇక్కడున్న పక్షులను తిలకించడానికి పలు ప్రాంతాలనుంచి అధికారులు ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు ఆనవాయితీగా వస్తుంటారు. అటువంటి స్థావరాన్ని ఎమ్మెల్యే బి.విజయ్‌చంద్ర సందర్శించడంతో ఏమైనా ఇక్కడ సౌకర్యాలు కల్పించడానికి నిధులు సమకూర్చుతారా అని స్థానికులు ఆశిస్తున్నారు.

జాగ్రత్తలు పాటిస్తూ నిమజ్జనాలు

పాచిపెంట: జాగ్రత్తలు పాటిస్తూ వినాయక నిమజ్జనాలు చేపట్టాలని ఎస్సై వెంకట్ సురేష్ అన్నారు. 5,6, తేదీల్లో మండలం లో వినాయక నిమజ్జనాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మరోసారి కమిటీ సభ్యులకు పలు సూచనలు సలహాలు చేస్తూ గురువారం ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు పూర్తిస్థాయి నీటిమట్టం కలిగి ఉన్నాయని, జాగ్రత్తలు పాటిస్తూ నిమజ్జనం చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కమిటీ సభ్యులదే పూర్తి బాధ్యత అన్నారు. నిమజ్జనం సమయంలో మద్యం తాగి అల్లర్లు, తగాదాలకు ప్రేరేపిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

తారెత్తిస్తున్న గ్రామసింహాలు



- 8 నెలల్లో జిల్లావ్యాప్తంగా కుక్క కాటుకు గురైన వారు 2185 మంది
- కుక్కకాటుతో జిల్లా కేంద్రంలో మృతి చెందిన నాలుగేళ్ల బాలుడు
- శునకాల బెడదను పట్టించుకోని అధికారులు




వీధుల్లో స్వైర విహారం చేస్తున్న కుక్కలు

పార్వతీపురం రూరల్:


గుంపులు గుంపులుగా వీధి కుక్కలు తిరుగుతూ వీధుల్లోని ప్రజలను హడలెత్తిస్తున్నాయి. ప్రజలపై శునకాల దాడులకు ఫుల్‌స్టాప్ పడడం లేదు. చిన్నారులు ఆటలు ఆడుతున్నప్పుడు, ద్విచక్ర వాహనాలపై వాహన చోదకులు వెళ్తున్నప్పుడు ఏ మూల నుంచి ఏ కుక్క వచ్చి దాడిచేస్తుందో తెలియని భయానక పరిస్థితులు నెలకొన్నాయి. చిన్నారులను ఒంటరిగా వదలాలంటేనే తల్లిదండ్రులు భయపడే పరిస్థితి ఏర్పడింది. వీధిలోనే ఇంటి ముందే ఆడుకుంటున్నా ఎప్పుడు ఏం జరుగుతుందోననే ప్రజలు భీతిల్లుతున్నారు.

నాలుగేళ్ల బాలుడి మృతి


కుక్క కాటు కారణంగా మృతి చెందిన బాలుడు లోహిత్ (ఫైల్)

గత నెల 16న పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఉన్న మణికంఠ కాలనీలో గవర రోహిత్ అనే 4సంవత్సరాల బాలుడు తన ఇంటి సమీపంలో వీధిలో ఆడుకుంటున్న క్రమంలో ఓ వీధి కుక్క దాడి చేసి ఛాతీపై బలమైన గాయలు చేసింది. దీంతో తల్లిదండ్రులు హుటాహుటిన జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి వైద్యుల సూచనల మేరకు మూడు రోజుల పాటు చికిత్స అందించారు. అయితే కొన్ని రోజుల పాటు చలాకీగా ఉంటూ ఇటీవల వీధిలో ఏర్పాటు చేసిన చవితి మంటపం వద్ద డాన్సులు వేస్తూ అలరించిన చిన్నారి లోహిత్ ఒక్కసారిగా మంగళవారం తీవ్ర ఆరోగ్యానికి గురవడంతో, తల్లిదండ్రులు జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా మృతి చెందాడు. కుక్క కాటు కారణంగానే తమ కుమారుడు మృతి చెందినట్లు తల్లిదండ్రులు, బంధువులు చెబుతున్నారు. అలాగే గతంలో జియ్యమ్మవలస మండలం బిత్రపాడు వద్ద కుక్కల దాడిలో శంకరరావు అనే రైతు దారుణంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. ఇదే మండలంలో పక్క గ్రామమైన వెంకటరాజపురంలో వీధి కుక్కలు దాడి చేయడంతో లక్ష్మి అనే వృద్ధు వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. అలాగే సాలూరు పట్టణంలోని మూడో వార్డు గుమడాంలో కుక్కల స్వైర విహారం చేస్తూ గుంపులుగుంపులుగా వచ్చి పశువుల శాలలో ఉన్న నెలరోజుల వయస్సు గల 27 మేకపిల్లలపై దాడి చేసి వాటి మృతికి కారణమయ్యాయి.

2185 మందికి కుక్క కాటు



వీధి కుక్కల దాడిలో గాయపడిన వారి సంఖ్య ఏటా వేలల్లో ఉంటోంది. ఆరోగ్య శాఖ లెక్కల ప్రకారం 2025జనవరి నుంచి 2025 సెప్టెంబర్ వరకు 2185 మంది కుక్క కాటు బారిన పడ్డారు. ఇది కేవలం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారి సంఖ్య మాత్రమే. ప్రైవేట్ ఆస్పత్రులు, ఇతర నాటు వైద్యుల వద్దకు వెళ్లి చికిత్స పొందిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

స్వైర విహారం చేస్తున్నాయి

వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. పార్వతీపురం, సాలూరు, పాలకొండ మున్సిపాలిటీల్లోను, అలాగే పలు గ్రామాల్లో రోడ్లపై తిరుగుతూ చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్ర వాహనదారులను వెంబడించి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వీధి కుక్కల స్వైర విహారంతో స్థానిక ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రి సమయాలలో సైతం రోడ్లపైకి వచ్చి నడుచుకుంటూ వేళ్లే వారిపై వీధి కుక్కలు దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు కుక్కల దాడులకు బలవుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదైనా సంఘటన జరిగినప్పుడే స్పందించే అధికారులు తరువాత ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యం

పెంపుడు కుక్క కరిచినప్పుడు, బాధితుడు కుక్క యజమానిని సంప్రదించి, దానికి రేబిస్ టీకాలు వేయించారో లేదో కనుక్కోవాలి. ఈ పని తప్పనిసరిగా చేయాలి. ఇలా చేస్తే సమస్య సగం పరిష్కారమైనట్లే. వీధి కుక్కలు లేదా గుర్తు తెలియని కుక్క కాటుకు గురైన వారు వెంటనే గాయమైన ప్రాంతాన్ని శుభ్రంగా 10 నిమిషాల పాటు కడగడంతో పాటు 24 గంటల్లోపే వ్యాక్సిన్ తీసుకోవాల్సి ఉంటుంది. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు. గాయాల తీవ్రత ఎక్కువగా ఉంటే వైద్యులు యాంటీబాడీ థెరపీ చేస్తారు. ఫలితంగా రేబిస్ వ్యాధి నుంచి తప్పించుకోవచ్చు.

– టి. జగన్మోహనరావు, జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి, పార్వతీపురం మన్యంజిల్లా

ఘనంగా గురుపూజోత్సవం


గుడివాడ కాలనీ పాఠశాలలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


బక్కుపేటలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలాంకృతం చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరిస్తున్న హెచ్ఎం ప్రసన్నలక్ష్మి


మక్కువ: కాశీపట్నం పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత చరిత్రను చదివి వినిపిస్తున్న విద్యార్థి

బలిజిపేట: ఉపాధ్యాయ దినోత్సవాన్ని గుడివాడ కాలనీ పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులకు అభినందనలు తెలుపుతూ బహుమతులు అందించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. గుడివాడకాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుక ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన గొప్పతనాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిరోజున ఏటా జరిగే గురుజోత్సవాన్ని పురస్కరించుకుని ముందుగా గురువారం మండలంలోని పాఠశాలల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూల మాలాంకృతం చేశారు. బక్కుపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులకు విద్యార్థులు పుష్పగుచ్ఛాలిచ్చి గురుభక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గౌరీశ్వరరావు, కృష్ణదాసు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఉన్నత పాఠశాలలో..

గురుజోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఇల్లా ప్రసన్న లక్ష్మి ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మేథ్స్ స్కూల్ అసిస్టెంట్ కొయ్యాన శ్రీరాములు, సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ దేవల రామారావును విద్యార్థులు పుష్పగుచ్ఛాలతో సత్కరించగా హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెయజేశారు.

ద్రవజీవామృతం తయారీ


మిర్తివలసలో తయారుచేస్తున్న ద్రవజీవామృతం

బలిజిపేట: మండలంలోని మిర్తివలస, సుభద్ర గ్రామాల్లో రైతుల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో ద్రవజీవామృతాన్ని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జ్‌లు లక్ష్మి, తిరుపతిరావులు రైతులు గురువారం తయారుచేశారు. ఒకడ్రమ్ము ద్రవజీవామృతం తయారీకి 200లీటర్ల నీటిని, 2కిలోల బెల్లం, 2కిలోల పప్పుల పిండి, 20లీటర్ల గోమూత్రం, 20కిలోల ఆవుపేడ, పిడికెడు పుట్టమన్ను తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. పై పదార్థాలన్నింటిని గోమూత్రంలో విడివిడిగా కరగదీసి నీటిలో కలపాలని చెప్పి తయారుచేసి చూపించారు. ఈ మిశ్రమాన్ని కనీసం 5రోజులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఒక కర్ర సహాయంతో సవ్య దిశలో కలుపుకోవాలని వివరించారు. దీని వినియోగం వల్ల భూమిలో అన్ని రకాల సూక్ష్మజీవులు వృద్ధి చెంది ప్రధాన పంటకు కావలసిన అన్ని రకాల సూక్ష్మ పోషకాలు లభిస్తాయని చెప్పారు. దీని వల్ల నాణ్యమైన, ఆరోగ్యకరమైన దిగుబడులు అందుతాయన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్లాప్ మిత్రలు మెలకువలు పాటించాలి


మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నాగభూషణం

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో ప్రతిరోజూ వేకువ జామునుంచి చెత్తను సేకరించడంలో క్లాప్ మిత్రలు మెలకువలు పాటించాలని డీఎల్‌పీఓ ఎం.నాగభూషణం అన్నారు. ఈ మేరకు మండలంలోని సూరంపేట పంచాయతీ మరిపివలస, సూరంపేట, చిన్నారాయుడుపేట గ్రామాల్లో క్లాప్ మిత్రలు ఇంటింటికీ వెళ్లి సేకరిస్తున్న తడిచెత్త, పొడి చెత్త ప్రక్రియను గురువారం వేకువజామున గ్రామాల్లోకి వెళ్లిన ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లాప్ మిత్రలు ప్రతిరోజూ మూడు చక్రాల తొట్టిలున్న వాహనం ద్వారా ఇంటింటికీ చెత్త సేకరించే సమయంలోనే తడి, పొడి చెత్తను శుద్ధి చేయడానికి ఎస్‌డబ్ల్యూపీసీలో భద్రపరిచి సేంద్రియ ఎరువు తయారు చేయడానికి నిర్మించిన తొట్టిలో సిద్ధం చేయాలని సూచించారు. అలాగే చెత్తనుంచి సంపద తయారీకి అవసరమైన ముడిసరుకు, ఎరువు ఉత్పత్తికి అవసరమైన ఎర్రల పెంపకానికి సమాయత్తం కావాలని సూచించారు. అనంతరం చెత్త సేకరణపై మహిళలను ఆరాతీశారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పయ్యమ్మ, మురళి పాల్గొన్నారు.

కాశీపేటలో చెత్తశుద్ధి కేంద్రం పరిశీలన..

మండలంలోని కాశీపేటలో చెత్తనుంచి సంపద తయారుచేస్తున్న కేంద్రాన్ని డిప్యూటీ ఎంపీడీఓ కె కుమారవర్మ గురువారం ఉదయం పరిశీలించారు. కంపోస్టు ఎరువు తయారీని పరిశీలించిన అనంతరం పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, క్లాప్‌మిత్రలకు పలు సూచనలు చేశారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

- డీపీఓ కొండలరావు


లక్ష్మీనారాయణపురంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీఓ కొండలరావు

పార్వతీపురం రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని ఇంటింటికి చెత్త సేకరణ క్రమం తప్పందా సేకరిస్తూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఇచ్చే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ సేకరించిన చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను చెత్తసేకరణ కేంద్రాలకు తరలించాలని డీపీఓ కొండలరావు అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండలంలోని లక్ష్మీనారాయణపురంలో జరుగుతున్న పారిశుద్ధ్యపనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ చెత్తసేకరణ సిబ్బందికి సహకరిస్తూ చెత్త నిల్వలను ప్రతిరోజు పరిసరాల్లో పడవేయకుండా అప్పగించాలని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో కాలువలు, ఇంటి పరిసరాల్లో వ్యర్థాలు, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ తదితరులు పాల్గొన్నారు.

వసూళ్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదా?

- మార్కెట్ యార్డు అభివృద్ధిపై దృష్టి సారించాలి


మార్కెట్ యార్డులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు

పార్వతీపురం టౌన్: మార్కెట్ యార్డ్ సెస్ వసూళ్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదా అని సీఐటీయూ కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ పిలుపులో భాగంగా గురువారం స్థానిక మార్కెట్ యార్డులో కరపత్రాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మార్కెట్ యార్డులో పశువుల సంతకు ప్రతి గురువారం వేల దున్నలు, గేదెలు, ఎడ్లు, ఆవులు, గొర్రెలు, మేకలు తోలుకుని రైతులు వస్తారన్నారు. కోళ్లు అమ్ముకునేందుకు వందల మంది ప్రజలు వస్తారు. అలాగే పశువులు, గొర్రెలు, మేకలు కొనుక్కునేందుకు రైతులు, ప్రజలు వస్తారని, సంత అంతా పేడ, బురదతో గలీజు గలీజుగా తయారైందని, సంతకు తెచ్చే పశువులు, గొర్రెలు, మేకలు ప్రాణులు, వాటిని అమ్ముకానికి తెచ్చిన, కొనడానికి వచ్చిన వారు మనుషులు కారా? అని ప్రశ్నించారు. అధికారులు, ఇక్కడ పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ కార్యవర్గం వారికి పశువులు ఉంటే ఇలాగే ఉంచుకుంటారా? అని ప్రశ్నించారు. తెచ్చిన ప్రతి జీవానికి రూ. 10 వసూలు చేస్తూ మున్సిపాలిటీకి పన్ను, జీవం కొనుగోలు, అమ్మకంపై 10శాతం సెస్ మార్కెట్ యార్డు వసూలు చేస్తోందని, సంతను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. సంతను పరిశుభ్రంగా ఉంచలేకపోయినా, సవ్యంగా నిర్వహించలేకపోయినా జీవాలపై పన్ను వసూలు చేయడం మానివేయాలని డిమాండ్ చేశారు. పన్ను వసూలు చేస్తే సంత పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. లేకుంటే ఆందోళన, నిరసన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు బంకురు.సూరిబాబు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుడు ఉమామహేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

బోరు మరమ్మతులు చేయండి సారూ..!


నవిరి కాలనీలో నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

పార్వతీపురంటౌన్: మున్సిపాలిటీలోని నవిరి ఎస్సీ కాలనీలో ఆరవ వార్డులో బోరు పాడైపోయి దాదాపు 25 రోజులవుతోందని, తాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని మరమ్మతులు చేపట్టాలని విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కమిటీ సభ్యుడు పి.సంగం ఆధ్వర్యంలో వార్డు వాసులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఈ సమస్యపై పలు మార్లు విన్నవించుకున్నా మున్సిపాలిటీ అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది ఎవరు పట్టించుకోవట్లేదన్నారు. తక్షణమే నవిరి ఎస్సీ కాలనీలో బోరు బాగు చేసి తాగునీరు అందిచాలని కోరారు. కుళాయి నీరు ఆరేడు రోజులకు రావడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రజా ప్రతినిధులు తక్షణమే చర్యలు తీసుకుని బోరు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు దామోదర్ రావు, జ్యోతి, రాములమ్మ, మంగ, లక్ష్మి, దీన, పరిమళ, సూరయ్య, వర్షిని, భవాని తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష చూపరాదు


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ రాజ్యలక్ష్మి

బలజిపేట: లింగ వివక్షపై అందరికీ అవగాహన అవసరమని సీడీపీఓ రాజ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు బలిజిపేట సచివాలయంలో లింగ వివక్షపై గురువారం మండలస్థాయి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల రక్షణ, సామాజిక ఆర్థిక స్వావలంబనలో వివక్ష చూపరాదన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని కోరారు. పోక్సో చట్టం అమలు, గృహహింస వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. బాలల హక్కులు కాపాడడంలో గ్రామస్థాయి ప్రజలందరూ చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో అరసవిల్లినాయుడు, టి.పైడపునాయుడు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పద్మ, రేవతి, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాల మేతతో మంచి దిగుబడి

- పశువులలో పునరుత్పత్తి సామర్థ్యం
- పెరగనున్న పాల ఉత్పత్తి


మేతకు వెళ్తున్న గేదెలు

బలిజిపేట: పాడి పశువులకు పుష్టికరమైన మేత అందించడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. నాణ్యమైన మేత అందించడం కారణంగా పశువుల్లో పునరుత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. పాల ఉత్పత్తి పెరుగుతుందని పశుసంవర్థక శాఖ అధికారులు సూచిస్తున్నారు. పాడిపశువుల్లో విటమిన్ ఎ, కాల్షియం, ఫాస్పరస్ వంటి పోషక పదార్థాల లోపం వల్ల పునరుత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది. చాలామంది రైతులు వర్షాకాలం, చలికాలంలో పచ్చిమేతలు, ఎండాకాలంలో ఎండు గడ్డిని దాణాగా అందిస్తారు. ఇది సరైన పద్ధతి కాదు. పచ్చిమేత ఎక్కువగా దొరికే కాలంలో దానికి పాతరవేసి నిల్వ చేసుకోవాలని, అన్ని కాలాల్లో పచ్చిమేత అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచిస్తున్నారు.

మేత ఏవిధంగా ఉండాలంటే

రోజూ ఒక్కో పశువుకు 8కిలోల వరిగడ్డి, లేదా ఎండు చొప్ప(మొక్కజొన్న, జొన్న) 8కిలోల లెగ్యూమ్ జాతి పచ్చిమేత(పిల్లిపెసర, అలసంద, గోరుచిక్కుడు) 16కిలోల గింజ జాతి పచ్చి మేతలు ఇస్తే పశువులకు అన్ని రకాల పోషకాలు అందే అవకాశాలున్నాయి. పాల దిగుబడిని బట్టి పశువులకు దాణా అందించాలి. పోషకాలతో కూడిన గడ్డిని ఇస్తే సకాలంలో ఎదకు వస్తాయి. పాల ఉత్పత్తి కూడా అధికంగా ఉంటుందని పశుసంవర్థక శాఖ అధికారులు చెబుతున్నారు.

5రకాల పోషకాహారం అందించాలి

పశువులకు 5రకాల పోషకాహారాలు అందించాలి. పిండిపదార్థం ఉండేవి, మంసకృత్తులు ఉండేవి, కొవ్వు, ఖనిజాలు, విటమిన్లు కలిగి ఉండే ఆహారం అందిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. పశువులకు మంచి పోషణ లభిస్తుంది.

గణేష్, మండల పశువైద్యాధికారి, బలిజిపేట

యూరియా కోసం రైతుల ఎదురు చూపులు


వెంకంపేటలో యూరియా లేక అమ్మోనియా జల్లుతున్న రైతుతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం రూరల్: ప్రస్తుతం గ్రామాల్లో రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని, వరి మడుల్లో యూరియా జల్లేందుకు ఎదురు చూస్తున్న క్రమంలో ప్రభుత్వం సక్రమంగా ఎరువుల సరఫరా చేయకపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో రైతన్నలు ఆందోళన చెందుతున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వి. దాలినాయుడు అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని వెంకంపేట గ్రామంలో రైతులను సందర్శించి యూరియా కొరతపై మాట్లాడారు. ప్రభుత్వం సక్రమంగా యూరియా అందుబాటులో ఉంచని కారణంగా పొలాల్లో అమోనియా, దుబ్బు గుళికలు జల్లుకుంటున్నట్లు వారికి రైతులు వివరించారు. ఈ ఏడాది ఖరీఫ్ మొదలు నేటివరకు ప్రభుత్వం ఎరువులు సక్రమంగా పంపిణీ చేసిన దాఖలాలు కనిపించలేదన్నారు. ఈ మేరకు తాము అప్పులు చేసిన పెట్టుబడి పెట్టిన పంట ఏమవుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకుడు గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

6న గుడ్ టచ్-బ్యాడ్‌టచ్‌పై అవగాహన

పార్వతీపురంటౌన్:

ఈనెల 6వ తేదీ శనివారం గరుగుబిల్లిలోని డా.బీఆర్.అంబేడ్కర్ గురుకుల కళాశాలలో మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా రెండవ అదనపు జడ్జి, మండల లీగల్ సెల్ అధ్యక్షుడు ఎస్.దామోదరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తల్లిదండ్రులు, పిల్లలకు అవగాహన కల్పించేందుకు ముఖ్యమైన విషయాలు, సూచనలు తెలియజేయనున్నట్లు చెప్పారు. పిలలకు సురక్షితమైన స్పర్శ ఏది, సురక్షితం కాని స్పర్శ ఏది అనే దానిపై స్పష్టమైన అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఏదైనా చెడు స్పర్శను ఎదుర్కొన్నప్పుడు వారు భయపడకుండా పెద్దలకు చెప్పాలని ప్రోత్సహించడం వంటివి కార్యక్రమంలో వివరించనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.